# ఆదర్శ కుటుంబం

పునీత కుర్యాక్కోస్  ఏలియాస్ గారు కుటుంబ సంక్షేమం కోసం
రచించిన కుటుంబ దిశా నిర్దేశాల (Chāvarul)
యొక్క నూటయాభయ్యవ సంవత్సరం (1868-2018)





పునీత కుర్యాక్కోస్
ఏలియాస్ గారి
కుటుంబ దిశా నిర్దేశాల
(Chāvarul)
150 వ సంవత్సరం

# ఆదర్శ కుటుంబం

## పునీత కుర్యాక్కోస్ ఏలియాస్‌గారు,
## కుటుంబ సంక్షేమం కోసం రచించిన కుటుంబ దిశా నిర్దేశాల
## యొక్క నూటయాభయ్యవ సంవత్సరం (1868-2018)

1. ఆదర్శవంతమైన క్రైస్తవ కుటుంబం పరలోక రాజ్యమును పోలియున్నది. రక్త సంబంధికులు, కుటుంబములోని పెద్దల పట్ల గౌరవముతో, పరస్పర ఐక్యముతో జీవించాలి. ప్రతి వ్యక్తి తన జీవితాంతస్తుకు తగినట్లు జీవించాలి. సకల కార్యములలో నిత్య రక్షణ లక్ష్యముగా అలవరచుకోవాలి.

2. దేవుడు మీకనుగ్రహించిన అమూల్యదానమే మీ బిడ్డలు. వారిని క్రమశిక్షణలో పెంచి సంరక్షించడం మీ బాధ్యత. వారు, యేసుక్రీస్తు మీకు ఒప్పగించిన ఆత్మలే. తన దివ్యరక్తముచే పవిత్రపరచుటకు, తన సేవకులుగా మార్చుటకు, తుదితీర్పు దినమున ఆయనకు ఒప్పగించుటకు వారిని ఆయనే మీ సంరక్షణలో ఉంచారు.

3. కుటుంబ సభ్యుల మధ్యగల ప్రేమ, సుస్థిరముగా ఉండాలి. కుటుంబములో మనం పొందే ప్రేమ, శాంతి, ఆప్యాయతలద్వారా, అనుదిన జీవితములో మనకెదురయ్యే దుఃఖదురితాలను, సమస్యలను సునాయాసముగా జయించ గలము.

4. కుటుంబములో క్రమపద్ధతి, శాంతి, నిత్య రక్షణ గురించిన చింతన అలవరచుకోవాలి. ఈ భావం లేకపోవటం వలన ఉన్నత ఆర్థికస్థాయిలో నున్న ఎన్నో కుటుంబాలు పతనమైనవి.

5. ప్రతి కుటుంబములోని సభ్యుల మధ్యగల సంబంధానికి నిస్వార్థప్రేమే పునాదిగా నుండాలి. రక్త సంబంధము నుండి రూపొందే ఈ ప్రేమే పరస్పరం అంగీకరించి, తప్పిదాలను క్షమించుటకు ప్రేరేపణ

కలిగిస్తుంది. కుటుంబాల మధ్య తగాదాలకు, వాదోపవాదాలకు తావివ్వకూడదు.

6. మీ బిడ్డలను, వినయం, ఇంద్రియ నిగ్రహాలతో పెంచవలెను. శారీరక సౌందర్యము యొక్క అనుచిత ప్రదర్శన, సక్రమం కాని వస్త్రధారణం, హాని కలిగిస్తాయి.

7. విలువలను నేర్పించే సందేశాత్మక గ్రంథాలు, పిల్లల అందుబాటులో ఉంచాలి. వారు ఏవైన చెడు పుస్తకాలు చదువుతున్నారా అని పరీక్షించాలి. చెడు పుస్తకాలు దాచిపెట్టడం ఎండుగడ్డిలో అగ్ని దాచినట్లు ప్రమాదకరం.

8. పిల్లలను సక్రమంగా పెంచడంలో శ్రద్ధ చూపించాలి. ప్రతి దినం వారిని దైవసన్నిధిలో సమర్పించి ప్రార్థించాలి.

9. పిల్లల విద్యాభ్యాసములో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. వారి మిత్రులు ఎలాంటివారో తరచుగా పరీక్షిస్తూ ఉండాలి.

10. బిడ్డలను శాసించడములో, శిక్షించడములో వివేకమును, మితమును పాటించాలి.

11. బాల్యమునుండియే బిడ్డలకు ప్రార్థించడం నేర్పించాలి. సుస్థిరమైన దైవ విశ్వాసములో వారు ఎదుగునట్లు చూడవలెను.

12. మీ దినచర్య ప్రణాళికా బద్ధంగా ఉండాలి. అస్తవ్యస్తముగా ఉండకూడదు.

13. బిడ్డలు ప్రాయములో ఎదిగినపుడు తమ జీవితాంతస్తును ఎన్నుకోవడములో వారికి స్వేచ్ఛనివ్వాలి.

14. తల్లిదండ్రులు వృద్ధులు కాకముందే, విచక్షణా శక్తి కోల్పోక ముందే, వీలునామా వ్రాసి, ఎవరిభాగం వారికి పంచి ఇవ్వాలి.

15. బిడ్డలు తమ తల్లిదండ్రులను నిత్యం ఆదరించాలి. వారి వృద్ధాప్యములో, రోగావస్థలో, వారిని కంటికి రెప్పలా సంరక్షించాలి. అలాచేస్తే దేవుడు బిడ్డలపై, తన దీవెనలు, సమృద్ధిగా వర్షిస్తారు.

16. మీ ప్రేమబంధాలు, వివేకపూర్వకమై ఉండవలెను. నైతిక విలువలుగల వ్యక్తులతో మాత్రమే, మిత్రత్వం కొనసాగించాలి.

17. ఇతరులపట్ల విద్వేషం చూపించేవారు నరపశువులే. వివేకం, క్షమాగుణం ప్రదర్శించడంద్వారానే, మానవతా విలువలు వెల్లడి అవుతాయి.

18. సోదరులకు, ఇతర కుటుంబ సభ్యులకు వ్యతిరేకమైన వ్యాజ్యములు, న్యాయస్థానాలకు ఈడ్చకూడదు. హృదయాలు దూరం కావడానికి అవి కారణమౌతాయి.

19. ఎవరి వద్దనుండి కూడా అప్పుచేసి వ్యయం చేయకూడదు. అలాచేస్తే, తరువాతి తరము వారికి ఋణ బాధ్యత భారమవుతుంది.

20. నీవు ధనవంతుడవైతే, అది చాటుకోకూడదు. వినయముతో జీవించాలి. వివాహం మొదలైన మంగళ కార్యాలలో ఆడంబరం నివారించాలి. ఒక గడ్డివాములో ప్రజ్వలించే అగ్ని నైమిషికం. కాని ఒక దీపములో సదా వెలిగే చిరుజ్వాల శ్రేష్ఠతరం.

21. లోభితనం కూడా ఆడంబరం వలె ఒక దుర్గుణమే. ధనము మానవశ్రేయస్సు కొరకు వెచ్చించాలి. లేకున్నచో అది అనైతికమవుతుంది.

22. దైవవిశ్వాసం, క్రమశిక్షణగల కుటుంబాలతో మాత్రమే బంధుత్వం ఏర్పరచుకోవాలి. భౌతిక సంపద కొలమానం కాకూడదు.

23. మీ కుటుంబములో అందరికి కష్టపడి పనిచేసే అలవాటుండాలి. సోమరితనంతో సమయం వృథా చేయకూడదు. సోమరితనం అనేక దుర్గుణాలకు కారణమవుతుంది.

24. మద్యపానం అనే దురలవాటును మీ కుటుంబములోనికి రానీయకూడదు. అది కుటుంబ సంబంధములను శిథిలం చేస్తుంది.

25. మీ వ్యాపారములో నీతిన్యాయాలు త్యజింపకూడదు. అన్యాయ మార్గాన కూడపెట్టిన సంపద మంచువలె కరిగిపోతుంది.

26. ఇతరులకు ఏదైన మేలు చేయని దినం మీ జీవితములో ఉండకూడదు. మీ జీవిత గణనలో దేవుడు ఆ దినమును లెక్కింపడు. బిక్షగాండ్లు మీ ఇంటికి వస్తే వారిపై కోపించి వెళ్ళగొట్టకూడదు.

27. మీ పనివారికి న్యాయవేతనం ఇవ్వవలెను. నిరుపేదలను, బలహీనులను అవమానింప కూడదు. వారి కన్నీళ్లు దైవసమక్షములో మీకు వ్యతిరేక సాక్ష్యమిస్తాయి.

28. దివ్యబలి మీ కుటుంబాన్ని నిత్యకాంతితో ప్రకాశింప జేస్తోంది. అందువలన సాధ్యమైతే, ప్రతిదినం, ఇంటినుండి ఒక్కరైనా, దివ్యబలిలో పాల్గొనాలి.

29. ఆదివారములు, అప్పుపండుగలలో దివ్యబలిలో పాల్గొనడముతో బాధ్యత తీరునా? తీరదు. ఆ దినం సత్కార్యములు చేయుటకు, సద్గ్రంథాలు చదువుటకు, దేవుని వాక్కు ఆలకించుటకు కేటాయించాలి. నిరుపేదల భవనాలు సందర్శించి వారిని ఓదార్చాలి, వారికి తోడ్పడాలి. ఈ విధముగా ఆత్మకు అవసరమగు సత్కార్యములు యథావిధిగా అనుష్ఠిస్తూ అప్పుపండుగలను అర్థవంతముగా ఆచరించాలి.

30. కుటుంబములో విశిష్టాతిథులు వచ్చినా, కుటుంబ ప్రార్థన మానుకోకూడదు. నిశ్చిత సమయములోనే ప్రార్థించాలి. ఇలా చేయడం ఇతరులకు ఆదర్శముగా ఉంటుంది.

# చిన్నారులకు అమూల్య సందేశం

**కుల, మత, తర, తమ భేదాలకతీతంగా అందరు కలిసి కూర్చొని చదువుకునే సదవకాశాన్ని కల్పించిన సంఘసంస్కర్త, సి.ఎం.ఐ., సి.ఎం.సి. సభా స్థాపకుడు, పునీత కుర్యాక్కోస్ ఏలియాస్ గురువర్యులు (1805-1871) చిన్నారులతో, యువకులతో సంభాషిస్తున్నారు.**

1. బిడ్డలారా! మీరు మీ తల్లిదండ్రుల చేతిలో, దైవదానములై యున్నారు.
2. దైవభక్తి, దైవప్రేమగల బిడ్డలు తల్లిదండ్రులను ప్రేమిస్తారు, గౌరవిస్తారు.
3. తల్లిని ఆశ్రయించండి. తల్లి ప్రార్థన బిడ్డ ప్రార్థన వలె దేవుడు ఆలకిస్తాడు.
4. శారీరకాభివృద్ధికి ఆహారం వలె; విజ్ఞానం, విశుద్ధి ఆధ్యాత్మికాభివృద్ధికి ఆహారమై యుండాలి.
5. సక్రమంగా విద్యాలయమునకు వెళ్లి, బోధించిన విషయాలను క్రమపద్ధతిలో పునరుశ్చరణం చేయాలి.
6. సోమరితనం సకల దుర్గుణాలను పెంచి పోషిస్తుంది.
7. దైవభక్తిగలవారే మీ మిత్రులై యుండాలి.
8. మంచి మిత్రులు, మిమ్ము మంచివారిని చేస్తారు.
9. చెడు పుస్తకాలు మీ చెంత ఉంచుకోవటం, ఎండుగడ్డిలో అగ్ని దాచినట్లు ప్రమాదకరం.
10. నిరంతరం సద్గ్రంథాలను చదివి ధ్యానించండి. అవి మీ బుద్ధిని ప్రకాశింప జేస్తాయి.
11. సమయపాలన ద్వారా, క్రమశిక్షణ అలవరచు కోవాలి.
12. దురలవాట్లు గల మిత్రులతో కలిస్తే, దేవదూత లైన మీరు సైతానులుగా మారుతారు.
13. సాయంసంధ్యకు ముందే ఇల్లు చేరి సంధ్యా ప్రార్థనలో పాల్గొనాలి.
14. వయస్సుకు తగినట్లు మర్యాదపూర్వక వస్త్ర ధారణము, ఆధ్యాత్మిక పవిత్రత కలవారై యుండాలి.

15. అనుచిత వస్త్రధారణము, అలంకరణములు మిమ్ము దుర్మార్గములోనికి నడిపిస్తాయి.

16. మీ సామర్ధ్యమును, ప్రణాళికాబద్ధ జీవితం, దైవభక్తి, ఇంద్రియ నిగ్రహములాంటి విషయాలలో ప్రదర్శించాలి.

17. మీరు సత్యమును, నీతి న్యాయములను అలవర్చుకోవాలి.

18. వంచన, దొంగతనాల ద్వారా సంపాదించినవి మంచువలె అతిత్వరగా కరిగిపోతాయి.

19. మీ జ్ఞానమునకు, ప్రాయమునకు తగినట్లు పనిచేయాలి.

20. ఇతరులకు మేలుచేయని దినం మీ జీవితములో ఎన్నడును ఉండకూడదు.

21. మిమ్ము అవమానించారు, మీతో తగవులాడారు, అను విషయాలు మూర్ఖపు పట్టుదలకు, విద్వేషములకు దారి తీయకూడదు.

22. నిరుపేదలను అవమానింపకూడదు, వారికి ఎలాంటి ఇబ్బంది కలిగింపకూడదు.

23. మీ జీవితాంతస్తును నిర్ణయించేది దేవుడు, ఎన్నుకునేది మీరు.

24. సత్ప్రవర్తన, నైతిక విలువలు గలవారినే మీ జీవిత భాగస్వామిగా ఎన్నుకోవాలి.

25. మీరు జ్ఞానములో, సామర్ధ్యములో ఎదిగినా, తల్లిదండ్రులను ఆదరించి వారికి విధేయులై ఉండాలి.

26. మీ సోదరులను ద్వేషించకూడదు.

27. వృద్ధులైన తల్లిదండ్రులను సంరక్షించడం బిడ్డల బాధ్యత.

28. మీ వలన మీ తల్లిదండ్రులు బాధపడవద్దు. వారిని బాధిస్తే ఈ లోకములోనే మీరు శిక్ష అనుభవింపవలసి వస్తుంది.

29. అధిక వినయం గలవారే అందరి కంటే ఉత్తములు.

30. మీరు దేవునికి సొంతం. కనుక మీ జీవితం దేవునికి అంకితం కావాలి.

"చిన్నారులను నా యొద్దకు రానిండు.
ఆలాంటివారిదే దైవరాజ్యం" (మార్కు 10:14)



*Published by*
**© Department of Evangelization & Pastoral Ministry**
Mary Matha Vice-Province, Hyderabad
CMI Provincial House, Bellampally P.O.,
Mancherial Dt. 504 251
Telangana State, India

***February 2018***

***(For Private Circulation only)***